

మహిళల ఆర్థికాభివృద్ధితోనే..

మహిళలు ఆర్థికంగా ఎదుగుదల సాధించినప్పుడే దేశ పురోగతి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. 8లో▸

1 నుంచి 'యువ సంవాద్'

సాక్షి, సిటీబ్యూరో: దేశ స్వాతంత్య్రం, చరిత్ర, సంస్కృతి విజయాలపై ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు యువ సంవాద్ ఇండియా నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కుమారి ఖుష్బూ గుప్తా తెలిపారు. యువజన సంఘాల ద్వారా నిర్వహించే కార్యక్రమంలో పంచప్రాణ్‌పై ప్రశ్నలు, జవాబులతో సుమారు 500 మంది యువతతో ఇంటరాక్షన్ ఉంటుందని చెప్పారు. ఈ నెలాఖరులోగా దరఖాసు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో అంతర్జాతీయ సదస్సు నేడు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ సెంటర్ ఫర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9.30 గంటలకు 'కరెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ' 2వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కన్వీనర్ డా.ఎం సునీతారెడ్డి, కోఆర్డినేటర్ జి.శ్రావణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

సకాలంలో వైద్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

తుక్కుగూడ: అసంక్రమిత వ్యాధుల బారిన పడిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. బుధవారం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వ్యాధిగ్రస్తులను గుర్తించి శాస్త్రీయమైన చికిత్సను అందించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎంసీడీ కిట్లను ఉచితంగా అందజేయాలన్నారు. వీరితో పాటు క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

షాద్‌నగర్: సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరానికి వచ్చే వారికి కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, కంటి అద్దాల పంపిణీకి సంబంధించిన వివరాల నమోదు గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండో విడత నిర్వహిస్తున్న శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని అన్నారు. అధికారులు, వైద్యసిబ్బంది సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ రమాదేవి, ఆప్తమాలజిస్టు తుకారాం, ఆర్పీ రాణి, సుధీర్, అశ్విని, భారతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు దేవాలయానికి కొత్త కమిటీ వేయాలి

గున్నాల వంశీయులను చైర్మన్‌గా నియమించాలి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయ కమిటీ చైర్మన్‌గా గున్నాల వంశీయులను నియమిస్తూ నూతన కమిటీ వేయాలని గున్నాల వంశీయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మొయినాబాద్‌లో గున్నాల వంశీయులు నర్సింహారెడ్డి, రాంచంద్రారెడ్డి, అనుసూజమ్మ, దశరథ్‌రెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడారు. గున్నాల వంశీయులను చిలుకూరు బాలాజీ దేవాలయం ధర్మకర్తలుగా గుర్తించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తు చేశారు. అర్చకుడు సౌందరరాజన్ 2005 నుంచి వివిధ కోర్టులకు వెళ్లినా అన్ని చోట్ల తమకే అనుకూలంగా తీర్పులు వచ్చాయన్నారు. 2022లో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సౌందరరాజన్ సుప్రీంకోర్టుకు వెళ్లారని.. ఈ నెల 13న అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునే సమర్థించిందన్నారు. దీని ప్రకారం గున్నాల వంశీయులను ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం నూతన కమిటీ వేయాలన్నారు.

కోర్టు తీర్పు ప్రభావం చూపదు

వంశపారంపర్య అర్చక ధర్మకర్తలు సౌందరరాజన్, గోపాలకృష్ణ చిలుకూరు బాలాజీ దేవాలయం ధర్మకర్తల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ఆలయ నిర్వహణపై ఎలాంటి ప్రభావం చూపదని చిలుకూరు బాలాజీ దేవాలయం వంశపారంపర్య అర్చక ధర్మకర్తలు ఎంవీ సౌందరరాజన్, సీఎస్ గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక హక్కులు, మతపరమైన విధుల నిర్వహణ, సంస్థను నిర్వహించే హక్కులపై కోర్టు తీర్పు ఏ విధంగానూ ప్రభావితం కాదన్నారు. ఎండోమెంట్‌లో నమోదు చేయబడిన వక్ఫ్ దస్తావేజు ప్రకారం ఎండోవర్ శఠగోపాచారి వారసులం తామేనని పేర్కొన్నారు.

ఉరుకులు.. పరుగులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి



చేవెళ్ల: పరీక్షకు సమయం కావడంతో పరుగెత్తుకుంటూ వస్తున్న విద్యార్థిని

- ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు
- పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు విద్యార్థుల యాతన
- ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి నిరాకరణ
- నేడు ఇంటర్ ద్వితీయ పరీక్షలు మరూ

సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు విద్యార్థులు ఉరుకులు పరుగులతో వచ్చారు. కేంద్రాల్లోకి అరగంట ముందే అనుమతించారు. 8.45 గంటల తర్వాత వచ్చినవారిని మందలించి లోనికి అనుమతించగా 9 తర్వాత వచ్చిన వారిని కొన్ని కేంద్రాల్లో అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరగాల్సి వచ్చింది. పరీక్ష కేంద్రాలను డీఈసీతో పాటు హైపవర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీ చేశాయి. హైదరాబాద్ పరిధిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వరరావుతో పాటు డీఐఈఓ ఒడ్డెన్న, రంగారెడ్డి జిల్లాలో కలెక్టర్ హరీశ్‌తో పాటు డీఐఈఓ వెంక్యా నాయక్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డీఐఈఓ కిషన్ తదితరులు పర్యవేక్షించారు. తొలిరోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని అధికారులు ప్రకటించారు.

6,904 మంది గైర్హాజరు

గ్రేటర్‌లోని హైదరాబాద్-రంగారెడ్డి-మేడ్చల్ జిల్లాల పరిధిలో మొత్తం పరీక్షకు సుమారు 6,904 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 2,24,687 విద్యార్థుల గాను 2,17,783 మంది హాజరయ్యారు.

హైదరాబాద్ జిల్లా పరిధిలో..

హైదరాబాద్ జిల్లా పరిధిలో రెగ్యులర్ (జనరల్) 79,723 మంది ఉండగా 76,880 మంది హాజరయ్యారు. 2,843 గైర్హాజరయ్యారు. వృత్తివిద్యా కోర్సుకు సంబంధించి 4,530 మందికి గాను 4,282 మంది హాజరు కాగా 248 మంది గైర్హాజరయ్యారు.

రంగారెడ్డిలో..

రంగారెడ్డి జిల్లాలో రెగ్యులర్ (జనరల్) 70,687 మంది గాను 68,620 మంది హాజరయ్యారు. 2,067 మంది గైర్హాజరయ్యారు. వృత్తివిద్యకు సంబంధించి 3,994 మంది గాను 3,753 మంది హాజరు కాగా 241 మంది గైర్హాజరయ్యారు.

మేడ్చల్- మల్కాజిగిరిలో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెగ్యులర్ (జనరల్) 64,301 మంది విద్యార్థులకు 62,892 మంది పరీక్షకు హాజరు కాగా 1,409 మంది గైర్హాజరయ్యారు. వృత్తివిద్యా కోర్సుకు సంబంధించి 1,452 మందికిగాను 1,356 మంది హాజరు కాగా 96 మంది గైర్హాజరయ్యారు.



ఆమనగల్లు: పరీక్ష గది వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు

పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



సరూర్‌నగర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచన చేస్తున్న కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని అధికారులకు కలెక్టర్ హరీశ్ సూచించారు. ఎల్బీనగర్‌లోని శివాని జూనియర్ కళాశాల, సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి రోజు 74, 681 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే విద్యార్థులను లోనికి అనుమతించాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద మహిళా పోలీసు సిబ్బంది విధుల్లో ఉండేలా చూడాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలు అమలయ్యేలా పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంక్యా నాయక్ తదితరులు ఉన్నారు.



కౌంటింగ్ కోసం సిద్ధం చేసిన టేబుళ్లు

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడు

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు సరూర్ నగర్ స్టేడియంలో మొదలు కానుంది. మూడు జిల్లాల నుంచి మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 29,720 మంది ఓటర్లలో 26,866 మంది ఓటేశారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 28 టేబుళ్లను సిద్ధం చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక్కో అధికారితో పాటు నలుగురు కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. ఓట్ల కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు మినహా ఇతరులెవరినీ లోనికి అనుమతించరు.

ఒక్కో టేబుల్‌కి వెయ్యి ఓట్లు

ఓట్ల గణనలో భాగంగా తొలుత 137 బూత్‌ల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను ఒకచోటకు చేర్చి ప్రతి 50 బ్యాలెట్ పేపర్లను ఒక బండిల్‌గా జత కడతారు. ఆ తర్వాత ఓట్ల లెక్కింపునకు ఒక్కో టేబుల్‌కి వెయ్యి ఓట్లు ఇస్తారు. పోలైన మొత్తం ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓట్లు 50 శాతానికిపైగా మెజారిటీ సాధించిన వారిని విజేతగా ప్రకటించనున్నారు. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓట్లు యాభైశాతం రాకపోతే.. ఆ తర్వాత రెండు, మూడు, నాలుగు, ఐదు.. ఇలా చివరి ప్రాధాన్యత ఓటు వరకు లెక్కించి, అతి తక్కువ ఓట్లు సాధించిన వారిని ఎలిమినేట్ చేసుకుంటూ వచ్చి, చివరికి రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువ సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఫలితం మధ్యాహ్నం మూడు గంటల వరకు వెల్లడయ్యే అవకాశం ఉంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనివార్యమైతే.. తుది ఫలితం రాత్రి 7 గంటల వరకు వెలువడే అవకాశం ఉంది.

ఆనంద్ వర్సెస్ అడివి శేషు



నిత్యం విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండే పోలీసులు ఆటలతో సందడి చేశారు. నగర పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వార్షిక స్పోర్ట్స్ మీట్ బుధవారం గోషామహల్ స్టేడియంలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా సినీనటుడు అడివి శేషు హాజరై మాట్లాడారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీవీ ఆనంద్, అడివి శేషు కబడీ, వాలీబాల్, బాస్కెట్ బాల్ ఆటలతో ఉత్సాహపర్చారు. కార్యక్రమంలో నగర అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ సుధీర్‌బాబు, క్రైమ్ అడిషనల్ సీపీ ఏఆర్ శ్రీనివాస్, ఎస్బీ జాయింట్ సీపీ పి.విశ్వప్రసాద్, డీసీపీలు పాల్గొన్నారు.

– గన్‌ఫౌండ్రీ

సైబర్ నేరాలతో జాగ్రత్త



మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

- అపరిచిత వ్యక్తులతో పరిచయం వద్దు
- వ్యక్తిగత సమాచారం ఆన్‌లైన్‌లో షేర్ చేయొద్దు
- రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

ఇబ్రహీంపట్నం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు తగవన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో పురోభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళ్తున్న ఈ తరుణంలో ఈ రంగాలనే ఎంచుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేయొద్దని సూచించారు. డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సురక్షితంగా ఉంచుకోవాలని, సరైన సైబర్ సెక్యూరిటీ లేని ప్రదేశాల్లో అలాంటి కార్డులు ఉపయోగించకుండా జాగ్రత్త పడాలన్నారు. ఉచితంగా వస్తుందని వచ్చే మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఎలాంటి వేధింపులు ఎదురైనా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని, తగిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సైబర్ క్రైం పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1930ను సంప్రదించి నేరాలపై ఫిర్యాదు చేయొచ్చని సీపీ తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించే వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం డీసీపీ అనురాధ, డీసీపీ ఉమెన్ సేఫ్టీవింగ్ శ్రీబాలదేవి, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ ఉమామహేశ్వరరావు, ఎండ్‌నౌ ఫౌండేషన్ స్థాపకుడు అనిల్ రాచమల్ల, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి సావిత్రి, సీఐ రామకృష్ణ, గురునానక్ విద్యాసంస్థల చైర్మన్ గగన్‌దీప్ కోహ్లి, ఎండీ సైనీ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఠాణా సందర్శన

రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం డీఎస్ చౌహాన్ సందర్శించారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, ఆందోళన కార్యక్రమాలు తదితర విషయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, స్థానిక ఏసీపీ ఉమామహేశ్వరావు, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు సక్రమంగా మెలగాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌ను బుధవారం మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ నిర్మాణం బాగుందని కితాబిచ్చారు. సిబ్బంది పని విధానం, పోలీసుల సంక్షేమం గురించి ఆరా తీశారు. ఈ ప్రాంతంలో అధికంగా ఎలాంటి కేసులు వస్తున్నాయి.. క్రైం రేటు ఎలా ఉందని సీఐ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట ఇబ్రహీంపట్నం సీఐ ఉమామహేశ్వర్‌రావు, ఎస్‌ఐలు కృష్ణయ్య, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

18న ఇంటర్వ్యూలు

కొడంగల్ రూరల్: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ముస్లిం మైనార్టీ అభ్యర్థులు ఈనెల 18న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రేషన్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, ఆదాయ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 11కు మున్సిపల్ కార్యాలయానికి రావాలని సూచించారు.

అంతా భూమాయ!



నాగారంలో వివాదాస్పదమవుతున్న భూమి ఇదే..

- నిషేధిత భూములకు రిజిస్ట్రేషన్లు.. ధరణిలో మ్యూటేషన్లు
- కోర్టు ఉత్తర్వులను లెక్క చేయని రెవెన్యూ అధికారులు
- అడిగినంత ముట్టజెబితే చాలు సంతకాలు
- మహేశ్వరం మాజీ తహసీల్దార్ సహా మరికొంత మందిపై కేసు నమోదుతో కలకలం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎలాంటి వివాదాలు లేని పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం.. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ, భూదాన్, సీలింగ్ వంటి నిషేధిత జాబితాలోని భూములను పట్టా భూములుగా మార్చడం ఆ రెవెన్యూ అధికారికే చెల్లింది. అడిగినంత ఇస్తే చాలు సర్వే నంబర్, భూమి నేపథ్యం, కోర్టు కేసుల వంటి వాటిని కూడా చూడకుండా కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకాలు చేసింది. రూ.కోట్ల విలువ చేసే వక్ఫ్, భూదాన్ భూములకు నిరంభ్యంతర పత్రాలు జారీ చేసింది. రెవెన్యూ చట్టంలోని లోపాలను అడ్డుపెట్టుకుని తనకున్న విచక్షణాధికారాలతో నిషేధిత జాబితాలో ఉన్న భూములను 'పెద్ద' రియల్టర్లకు కట్టబెట్టింది. అధికారుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోయారు. వారసత్వం పేరుతో రూ.వందల కోట్ల విలువ చేసే భూములను కొల్లగొట్టారు.

నిషేధిత జాబితాలో ఉన్నా రిజిస్ట్రేషన్లు

మహేశ్వరం మండలం నాగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 181లో నిషేధిత జాబితాలో ఉన్న రూ.150 కోట్ల వెలువ చేసే 42 ఎకరాల భూమిపై ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. మహ్మద్ జబ్బర్దస్త్ ఖాన్ పేరున రిజిస్ట్రేషన్ అయిన ఈ భూమిపై కుటుంబ సభ్యుల మధ్య వాటాల పంచాయితీ కొనసాగుతోంది.సదరు భూమి క్రయ విక్రయాలపై ఆంక్షలు ఉన్నాయి.నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూ ములను అప్పటి తహసీల్దార్/జాయింట్ రిజిస్ట్రార్ ఆర్‌పీ జ్యోతి ఈపీఎల్ కన్‌స్ట్రక్షన్స్ ఓనర్ కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేరున రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలిసి వాటాదారుడైన దస్తగిరి షరీఫ్ మహేశ్వరం కోర్టును ఆశ్రయించగా..కోర్టు ఆదేశాల మేరకు భూ మిని విక్రయించిన ఖాదీర్ ఉన్నీసా-ఎ1,మహ్మద్ మున్నావర్-ఎ2తో పాటు తహసీల్దార్ జ్యోతి-ఎ3, ఎ4-బొబ్బిలి దామోదర్‌రెడ్డి, ఎ5-సంతోష్ కుమార్, ఎ6-కొండపల్లి శ్రీధర్‌రెడ్డిపై మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అక్రమ పద్ధతిలో భూములు రిజిస్ట్రేషన్లు కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. సదరు రియల్టర్ ఇప్పటికే సర్వే నంబర్ 181లోని భూమిలో విల్లాల పేరుతో ప్రీ లాంచ్ ఆఫర్లను ప్రకటించడం, జనం నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సమీకరించడం కొసమెరుపు. ప్రస్తుతం ఈ భూమిపై కేసు నమోదవడంతో ఇప్పటికే అడ్వాన్సులు చెల్లించిన కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

వక్ఫ్ భూమికి పాసు పుస్తకం జారీ.. తర్వాత రద్దు

మహేశ్వరం మండలం కొంగరకుర్దు-ఎలో సర్వే నంబర్లు 1 నుంచి 400 వరకు సుమారు 500 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. 1954 నుంచి ఇప్పటి వరకు పట్టా కాలమ్‌లో సయ్యద్ షారాజ్ ఖత్తార్ హుస్సేన్‌సాబ్ దర్గా పేరు ఉంటుంది. సర్వే నంబర్లు 85,86,88,89లోని 58 ఎకరాల భూమిని చెట్కూరి రామచంద్రారెడ్డి, గోదాసు సత్తయ్య, వీరస్వామి, చక్రపాణి కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నాయి. 2017కి ముందు వరకు పహాణీల్లోని కబ్జా దారుల కాలంలో వారి పేర్లు కన్పిస్తాయి. వాస్తవానికి ఈ భూమిని వక్ఫ్ భూమిగా పేర్కొంటూ 2008లో అప్పటి ప్రభుత్వం గెజిట్ కూడా జారీ చేసింది. ఇటీవల కొంతమంది రియల్టర్లు ఈ భూమికి నకిలీ ఓనర్‌షిప్ పత్రాలు సృష్టించారు. ఒకవైపు కలెక్టరేట్‌కు వెళ్లేందుకు రోడ్డు కోసం ప్రభుత్వం సేకరించిన భూమికి నష్టపరిహారం రైతుల పేరున కోర్టులో డిపాజిట్టై ఉండగా.. మరో వైపు ఈ భూమికి తామే అసలైన హక్కుదారులమని పేర్కొంటూ ఇటీవల కొంతమంది పొజిషన్‌లోకి రావడం వివాదాస్పదమైంది. విలువైన ఈ వక్ఫ్ భూములు పట్టా భూములుగా ఎలా మారాయనేదీ అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. ఇదే రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 82లోని 6 ఎకరాల వక్ఫ్ భూమికి సైతం పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడం, తర్వాత రద్దు చేయడం తహసీల్దార్ జ్యోతికే చెల్లింది. ఇక నాగారం రెవెన్యూ పరిధిలో వంద ఎకరాలకుపైగా భూదాన్ భూమి ఉండగా, ఇప్పటికే 50 ఎకరాలకు ఎన్‌ఓసీలు జారీ చేసినట్లు ఆరోపణలు లేకపోలేదు.

విచారణ చేపట్టాం

ఈ అంశంపై ఇప్పటికే విచారణ ప్రారంభించామని గురువారం సాయంత్రంలోగా సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ తప్పు చేసినట్లు తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మూడోసారీ అధికారం మాదే

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్‌: అభివృద్ధి, సంక్షేమంతో బీఆర్‌ఎస్‌ పార్టీ ముచ్చటగా మూడో సారీ అధికారంలోకి రాబోతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లిలో జెడ్పీటీసీ పీ అవినాశ్‌రెడ్డి అధ్యక్షతన 11 గ్రామ పంచాయతీ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సొంత స్థలం ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మీ పథకం ద్వారా రూ. 3లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న అనేక సమస్యలను రూ. 100 కోట్లు వెచ్చించి పరిష్కరించడం జరిగిందన్నారు. చందనవెల్లి, హైతాబాద్‌, మాచన్‌పల్లి, పేద్దవేడు, గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల పట్టాలు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇపిస్తామన్నారు. మాచన్‌పల్లి నుంచి పోతుగల్‌ వరకు, అలాగే అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, తండా, పోలారం, గోపిగడ్డ గ్రామాలకు రోడు వేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం షాబాద్‌ జెడ్పీటీసీ పీ అవినాశ్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ జీ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, ఎన్‌ శ్రీనివాస్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు సీ యాదయ్య, మండల కో–ఆప్షన్‌ సభ్యులు చాంద్‌పాషా, సర్పంచులు మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మంగమ్మ, నరేందర్‌రెడ్డి, మల్లేష, ఎంపీటీసీ జముకమ్మ, నాయకులు రాంరెడ్డి, గోపాల్‌ నాయక్‌, బల్వంత్‌రెడ్డి, ఏ అంజయ్య, కేశేఖర్‌, నరేందర్‌గౌడ్‌, నర్సింహులు, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశ పురోగతి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌

షాద్‌నగర్‌రూరల్‌: మహిళలు ఆర్థిక ఎదుగుదల సాధించినప్పుడే దేశ పురోగతి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. ఫరూఖ్‌నగర్‌ మండలం లింగారెడ్డిగూడలో బుధవారం ఎఫ్‌సీఎన్‌ (ఫౌండేషన్‌ ఫర్‌ చిల్డ్రన్‌ ఇన్‌ నీడ్‌) సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్‌ గీతాథామస్‌రెడ్డి సహకారంతో సర్పంచ్‌ మాధవి ఆధ్వర్యంలో సుమారు 130 మంది నిరుపేద, వితంతు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఎవరిపై ఆధార పడకుండా ముందుకు సాగాలన్నారు. ఒంటరి మహిళలు అన్న భావన వీడి ఆత్మస్థైర్యంతో సాగాలన్నారు. పురుషులతో సమానంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే సేవాభావాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళల సంక్షేమానికి ఎఫ్‌సీఎన్‌ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామ శివారులోని ఎఫ్‌సీఎన్‌ అనాథ ఆశ్రమంలో సర్పంచ్‌ మాధవి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ ఫుడ్‌ కమిషన్‌ చైర్‌పర్సన్‌ చిత్తా విజయప్రతాపరెడ్డి, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ఈట గణేష్‌, ఎంపీటీసీ బీ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



సుమయా బేగం(ఫైల్‌)

హయత్‌నగర్‌: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన సంఘటన బుధవారం హయత్‌నగర్‌ పోలీ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మునుగనూరుకు చెందిన ఎండీ పాజియా బేగం కూతురు సుమయా బేగం(21)కు నల్లగొండకు చెందిన ఆజంతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ నెల 10న కుటుంబ తగాదాల కారణంగా ఆమె భర్తతో గొడవ పడి మునుగనూరులోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం సాయంత్రం పని ఉందని బయటికి వెళ్లింది. తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను తప్పించబోయి..

భైక్‌ బోల్తా.. యువకుడి మృతి



సందీప్‌గౌడ్‌(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: బైక్‌పై వెళుతున్న యువకుడు కుక్కను తప్పించబోయి ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ డీ అజయ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మైసిగండి గ్రామానికి చెందిన బీ సందీప్‌గౌడ్‌(25), ఆర్‌ మహేష్‌ గౌడ్‌(26) ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తున్నారు. తుర్కయంజాల్‌లో పని నిమిత్తం మంగళవారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. తుక్కుగూడ సమీపంలో రోడ్డుకు అడ్డంగా కుక్క రావడం, దాన్ని తప్పించే క్రమంలో బైక్‌ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో సందీప్‌గౌడ్‌ తీవ్రంగా, మహేష్‌ స్వల్పంగా గాయపడ్డారు. పహాడీషరీఫ్‌ పోలీసులు క్షతగాత్రులను ఉస్మానియాకు తరలించారు. మార్గమధ్యలో సందీప్‌ మృతి చెందాడు. మృతుడి సోదరుడు నర్సింహాగౌడ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: యువత సేవాభావాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్‌ మండలం హాజిపల్లి శివారులో గల ఏవీ కన్వెన్షన్‌ హాలులో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వీర్లపల్లి శంకర్‌ ప్రారంభించి మాట్లాడారు. మనం చేసే రక్తదానం అత్యవసర సమయాలలో మరొకరికి ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. ప్రతిఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయవచ్చని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

తలకొండపల్లి: వృద్ధురాలిని హత్య చేసిన కేసులో ఇద్దరికి జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించినట్లు సీఐ ఉపేందర్‌ బుధవారం తెలిపారు. మండలంలోని పడకల్‌ గ్రామానికి చెందిన బీ దుర్గయ్య, సంతోషలకు వివాహేతర సంబంధం ఉంది. విషయాన్ని గమనించిన సీ మైసమ్మ(66) ఇది మంచి పద్ధతి కాదని మందలించింది. ఎలాగైనా మైసమ్మను చంపాలని దుర్గయ్య, సంతోష నిర్ణయించుకున్నారు. 2019 జనవరి 9న ఇంట్లో ఒంటరిగా ఉన్న మైసమ్మను సంతోష, దుర్గయ్య గొంతు నులిమి హత్య చేశారు. ఆమె బంగారు ఆభరణాలను తీసుకున్నారు. శవాన్ని సమీపంలో ఉన్న బావిలో పడేసి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి కేసును పరిశీలించి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చేవెళ్ల: కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైన సంఘటనలో ఒక్కరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎన్కేపల్లికి చెందిన కే కుమార్‌గౌడ్‌(38), అతని స్నేహితుడు కమ్మెట గ్రామానికి చెందిన జీ యాదయ్య(40) కారులో శంకర్‌పల్లి మండలానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈర్లపల్లి గేట్‌ దాటిన తరువాత కారు ప్రమాదానికి గురైంది. దీంతో కారులోని ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నగరంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుమార్‌గౌడ్‌ మృతి చెందారు. యాదయ్య చికిత్స పొందుతున్నారు.

క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడి దూరం



జస్టిస్‌ అభినంద్‌ కుమార్‌ షావిలితో న్యాయవాద సంఘం ప్రతినిధులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ అభినంద్‌ కుమార్‌ షావిలి

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సౌకర్యార్థం సీనియర్‌ న్యాయవాదుల సహకారంతో నిర్మించిన స్పోర్ట్స్‌ రూమ్‌ను రంగారెడ్డి జిల్లా పోర్టు ఫోలియో జడ్జి/హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ అభినంద్‌ కుమార్‌ షావిలి ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు గుర్రం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్‌ షావిలి మాట్లాడుతూ.. న్యాయవాదులు పనిఒత్తిడిని దూరం చేసుకునేందుకు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి, మెట్రోపాలిటన్‌ సెషన్స్‌ న్యాయమూర్తి ఆర్‌.తిరుపతి, తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకులు బాచిరెడ్డి శాయిరెడ్డి, సునీత బర్ల, బార్‌ కౌన్సిల్‌ సభ్యులు ములుగూరి ఫణీంద్ర భార్గవ్‌, ఆకుల అనంత్‌సేన్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఎర్ర పాపయ్యవారి వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం దేవరాజ్‌ గౌడ్‌, క్రీడా కార్యదర్శి జక్కుల విజయ్‌ కుమార్‌, కోశాధికారి వెంకటేష్‌, సంయుక్త కార్యదర్శి ధనుంజయ్‌ పాల్గొన్నారు.

18న బీసీల సమస్యలపై అఖిలపక్షం



ఎమ్మెల్సీ రమణను కలిసి అఖిల పక్ష సమావేశానికి ఆహ్వానిస్తున్న కృష్ణ

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య నేతృత్వంలో ఈనెల 18వ తేదీన కాచిగూడలోని అభినందన్‌ గ్రాండ్‌లో దేశ వ్యాప్తంగా బీసీల సమస్యలు చర్చించేందుకు అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ తెలిపారు. సమావేశానికి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ ఎల్‌. రమణను బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, బీసీలకు బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తదితర డిమాండ్లపై చర్చించేందుకు అఖిల పక్ష పార్టీల సమావేశం ఏర్పాటు చేసినట్లు గుజ్జ కృష్ణ తెలిపారు.

18న అన్నమయ్య ‘జానపద జాజర’

సాక్షి,సిటీబ్యూరో: శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నగరం వేదికగా పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 520వ వర్ధంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో అన్నమయ్య పద సాహిత్య విశ్లేషకులు వెంకట్‌ గరికపాటి వ్యాఖ్యానంతో ‘అన్నమయ్య జానపద జాజర’ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

మూషికమా.. మజాకా!



సాక్షి, సిటీబ్యూరో: గతంలో నిమ్స్‌లోని ఓ రోగిపై ఎలుకల దాడి సంగతి.. తాజాగా నగరంలోని ఓ ప్రముఖ ఫుడ్‌ చైన్‌ అవుట్‌లెట్‌లో బాలుడిపై ఎలుక దాడి తెలిసిందే. ఆస్పత్రి సంగతి ఎలా ఉన్నా.. అత్యాధునికంగా, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చే ప్రముఖ రెస్టారెంట్‌లలోనూ ఇలాంటి సంఘటన జరగడం గమనార్హం. ఈ రకమైన ఎలుకల వీరంగానికి కరోనా లాక్‌డౌన్‌ కూడా కారణమంటున్నారు కొందరు నిపుణులు.

అరుదు కాదు..

ఎలుకలు కొరుకుతున్న ఘటనలు నగరంలో అరుదుగానో ఎప్పుడూ జరగని సంఘటనలుగానో తీసిపారేయడం కాదు, బహిరంగ ప్రదేశాల్లో జరిగినవి మాత్రమే బయటకు తెలుస్తున్నాయి కానీ... ఇప్పటికే నగరంలో ఎలుక కొరుకుడు పెద్ద సమస్యగా మారిన సంగతి చాలా మందికి తెలుసు. ఇప్పటి వరకు ఒక్క ఫీవర్‌ ఆస్పత్రిలోనే 250కి పైగా ఎలుకలు కొరికిన కేసులు నమోదవడం దీనికి నిదర్శనం. గత పక్షం రోజుల్లో, ముగ్గురు ఎలుక కాటుకు గురయ్యారు. వీరిలో ఫుడ్‌ చైన్‌ అవుట్‌లెట్‌లో ఎనిమిదేళ్ల బాలుడితో పాటు కాకతీయ విశ్వ విద్యాలయంలోని ఉమెన్స్‌ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులు సైతం ఉన్నారు. ఒక పెద్ద ఎలుక బాలుడి ప్రైవేట్‌ భాగాలను కొరికితే, హాస్టల్‌లో నిద్రిస్తున్న మహిళల కాళ్లు చేతుల్ని కొరికేశాయి.

సమస్యగా పరిణమించిన ‘ర్యాట్స్‌’

- కరోనా లాక్‌డౌన్‌తో పెరిగిన వ్యాప్తి
- నియంత్రణ విభాగం లేకపోవడంతో పెరుగుదల
- నగరంలో వెలుగు చూస్తున్న ఎలుక కాటు ఘటనలు



లాక్‌ డౌన్‌.. ర్యాట్స్‌ అప్‌..

బహిరంగ చెత్త డంపులు, రెస్టారెంట్లు, హాస్టళ్లు ఆస్పత్రుల్లో పరిశుభ్రత లేకపోవడం ఎలుకల సంఖ్య భారీగా పెరగడానికి దోహదపడుతోంది. కోవిడ్‌ నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్‌ వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు వ్యాపారులు అంటున్నారు. ముఖ్యంగా రెస్టారెంట్లు, ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాల్లో ఎలుకల వ్యాప్తికి లాక్‌డౌన్‌ దోహదం చేసింది. ఎలుకల విజృంభణకు సంబంధించి 80% కాల్స్‌ లాక్‌డౌన్‌ తర్వాతే పెరిగాయని క్రిట్టర్‌ డిఫెన్స్‌ పెస్ట్‌ కంట్రోల్‌ సర్వీసెస్‌ సహ వ్యవస్థాపకుడు రిత్విక్‌ కిషోర్‌ అన్నారు. మరోవైపు ఇతర మెట్రో నగరాల మాదిరిగా కాకుండా, హైదరాబాద్‌లో ఎలుకలు పందికొక్కులకు ప్రత్యేక నియంత్రణ విభాగం లేకపోవడం కూడా ఒక కారణమేనని చెబుతున్నారు.

ఓల్డ్‌ సిటీలో ఎక్కువగా..

- ఓల్డ్‌ సిటీలో కూడా ఎలుకల సమస్య బాగా పెరిగిందని నగరానికి చెందిన ఒక పెస్ట్‌ కంట్రోల్‌ చెందిన కృష్ణ వరప్రసాద్‌ అంటున్నారు. ‘ఎలుకలు పెద్ద సంఖ్యలో నివసించే ప్రాంతాలలో మురుగు కాల్వలు చెత్త డంప్‌లు ప్రధానమైనవని, ముఖ్యంగా పాతబస్తీలో ఇలాంటి పరిస్థితులు బాగా ఎక్కువని అంటున్నారాయన. మూసీ సమీపంలోని అఫ్జల్‌గంజ్‌, ఆసిఫ్‌ నగర్‌, గోషామహల్‌ ఇతర పరిసర ప్రాంతాల నుంచి ఎలుకల గురించి ఫిర్యాదులు బాగా వస్తున్నాయి అని వరప్రసాద్‌ చెప్పారు.

తక్షణమే వైద్య సహాయం పొందాలి..

- ‘ఎవరికైనా ఎలుక కొరికిన తర్వాత జ్వరం వచ్చినట్లయితే తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలి. లేదంటే అది ప్రాణాంతకమైన బాక్టీరియల్‌ ఇన్ఫెక్షన్‌గా మారవచ్చు. టెటానస్‌ ఇంజెక్షన్‌ యాంటీ రేబిస్‌ వ్యాక్సిన్‌ తీసుకోవాలి’ అని జనరల్‌ సర్జన్‌ డాక్టర్‌ సాగర్‌ ప్రతాప్‌ చెప్పారు. ఎలుక కాటు అనేది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తప్ప మిగిలిన వారికి అంత ప్రమాదకరం ఏమీ కాదని ఫీవర్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డా.శంకర్‌ చెప్పారు. రక్తం వచ్చే స్థాయిలో గాయం ఉన్నప్పుడు వెంటనే తగిన ప్రాథమిక చికిత్స, అవసరాన్ని బట్టి టీటీ ఇంజక్షన్‌ తీసుకుంటే సరిపోతుందంటున్నారు.

ఆ క్షణాలను ఎప్పటికీ మరచిపోను

- ‘నాటు నాటు’ పాటకు ఆస్కార్‌పై జూ.ఎన్టీఆర్‌
- ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం



శంషాబాద్‌: ‘స్టేజీపై కీరవాణి, చంద్రబోస్‌ నిల్చుని ఆస్కార్‌ అందుకున్న క్షణాలను ఎన్నటికీ మరచిపోను.. అదే నా బెస్ట్‌ మూమెంట్‌’ అని సినీనటుడు జూ.ఎన్టీఆర్‌ అన్నారు. అమెరికా లాస్‌ఎంజిల్స్‌లో జరిగిన ఆస్కార్‌ వేడుకల్లో పాల్గొన్న ఎన్టీఆర్‌ బుధవారం తెల్లవారు జామున హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్‌ విమానాశ్రయంలో అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ.. ‘ఆర్‌ఆర్‌ఆర్‌’ సినిమా నాటు నాటు పాటకు ఆస్కార్‌ అందుకున్న అనుభవనం అనిర్వచనీయమైందన్నారు.

అందులో భాగస్వామిగా ఉన్నందుకు గర్వపడుతున్నానన్నారు. తెలుగువాడిగా.. భారతీయుడిగా గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్కార్‌ ఎంతో బరువుగా ఉందని, మన దేశం ఎంత బరువుగా ఉంటుందో అంతలా ఉందన్నారు. అనంతరం ఆయన ఓపెన్‌టాప్‌ కారులో అభిమానులకు అభివాదం చేస్తూ బయలుదేరారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: రోడ్డుపై నిలుచున్న యువకుడిని వాహనం ఢీ కొనడంతో ఆ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్‌, బాలాజీనగర్‌కు చెందిన కొత్తపల్లి శివకృష్ణ(26) అతని స్నేహితుడు కాటి శివ బైక్‌పై రాగన్నగూడ పరిధిలోని బేకరీకి వెళ్లారు. శివ బేకరీలోకి వెళ్లగా, ఫుట్‌పాత్‌పై శివకృష్ణ నిలబడ్డాడు. అతివేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్‌ స్కూటీని, శివకృష్ణను ఢీ కొట్టింది. ఈ ఘటనలో శివకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌ సత్యనారాయణ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని అతనిపై చర్యలు తీసుకోవాలని మృతుని తండ్రి కే జంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపులో పడి బాలుడు..

చేవెళ్ల మండలం ఆలూరులో ఘటన



భువనేశ్వర్‌ (ఫైల్‌)

చేవెళ్ల: ఇంటి ముందు నిర్మాణంలో ఉన్న సంపులో పడి రెండున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఆలూరుకు చెందిన ఎంపీటీసీ గోపులారం యాదమ్మ కొడుకు అశోక్‌ శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతనికి కూతురు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు సాయిచరణ్‌, చిన్న కొడుకు భువనేశ్వర్‌(3) బుధవారం ఇంటి ముందు ఆడుకుంటున్నారు. ఇంటి సమీపంలో సంపు నిర్మాణ పనులు చేపట్టారు. క్యూరింగ్‌ కోసం అందులో నీళ్లు నింపారు. ఆడుకుంటూ వెళ్లిన భువనేశ్వర్‌ అందులో పడిపోయాడు. బాలుడు కనిపించక పోవడంతో తల్లిదండ్రులు వెతికారు. మరో బాలుడిని తమ్ముడు ఎక్కడ అని అడగ్గా సంపు వైపు చూపాడు. దీంతో సంపులోని నీళ్లు తోడారు. అపస్మారక స్థితిలో బాలుడు కనిపించడంతో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శ్వాస ఆడడం లేదని, పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో తల్లిదండ్రులు నగరంలోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు చనిపోయాడని ధ్రువీకరించారు.